## క్లుప్తంగా

### 'భవిత' పిల్లలను పాఠశాలలకు పంపండి



భవిత కేంద్రంలో చిన్నారులతో డాక్టర్ నరసింహం, చామంతి నాగేశ్వరరావు తదితరులు

**కాకినాడ రూరల్:** మండలంలోని వలసపాకల గ్రామంలోని భవిత కేంద్రాన్ని స్టేట్ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ డాక్టరు ఐ.నరసింహం గురువారం సందర్శించారు. భవిత కేంద్రంలో సౌకర్యాలు, పిల్లలు హాజరును ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత వరకు బడిలో కూర్చోగలిగిన పిల్లలందరినీ సమీప ప్రాథమిక పాఠశాలలో కూర్చోబెట్టాలని అప్పుడే వాళ్లు ఇతర పిల్లలతో సమాజంలో కలిసిపోగలరన్నారు. ఆయనతో పాటు జిల్లా కో ఆర్డినేటరు చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ–2 నామ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**కాకినాడ సిటీ:** స్థానిక డి9 సెక్షన్ పరిధిలోని గంగనాపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ జి.ప్రసాద్ గురువారం తెలిపారు. గంగనాపల్లి ఫీడర్ పరిధిలోని గంగనాపల్లి, చీడిగ, సత్యవతి అపార్టుమెంట్స్, కొవ్వాడ మెయిన్‌రోడ్డు, కొవ్వాడ శ్రీనివాసనగర్, శివాలయం వీధి, మిత్రమా కాలనీ, మధురానగర్, మురళీ లే అవుట్, వీడియో కాలనీ, సిద్ధి వినాయకనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే డి1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ పవర్ హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ టౌన్ హాలు ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 12.30 గంటల వరకు బాదం వారి వీధి, సాలిపేట, ఉంగరాల వారి వీధి, సూర్యారావుపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

**సెక్షన్ 8 పరిధిలో..**

**కాకినాడ రూరల్:** కాకినాడ డి–8 పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు. మరమ్మతులు నిమిత్తం 11 కేవీ భావనారాయణపురం టెంపుల్ ఫీడర్ పరిధిలో సర్పవరం, పనసపాడు రోడ్డు, భావనారాయణపురం, పోస్టల్ కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### కార్మిక నాయకుడికి సంతాపం

**తాళ్లరేవు:** రేబిస్‌తో మృతి చెందిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు మందనక్క తణుకురాజు కుటుంబానికి పలువురు సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ సంఘాల్లో తణుకురాజు చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. మృతుని కుటుంబ సభ్యులను వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కూరాకుల సింహాచలం, రుద్రవరపు భూలోకం, విప్పర్తి శ్రీనివాసరావు, పులపకూర గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

### రోగులకు కంటి పరీక్షలు

**తాళ్లరేవు:** ఉప్పంగల పంచాయతీలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య నిపుణుడు శీరం సత్తిబాబు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. సత్తిబాబు మాట్లాడుతూ మూడు రోజులుగా సుంకరపాలెం, ఇంజరం, ఉప్పంగల గ్రామాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. ఆయా గ్రామాల నుంచి సుమారు 30 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం కిరణ్ కంటి ఆసుపత్రికి పంపినట్లు వివరించారు. సర్పంచ్ శాఖా శంకరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లూ.. పిల్లలతో అప్రమత్తం



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై మౌనిక

**సామర్లకోట:** ఆటో డ్రైవర్లు స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై మౌనిక అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను తీసుకువెళ్లడంతో పాటు వారి బ్యాగ్‌లను వేలాడదీస్తూ ఆటోలు వెళ్తున్నాయని అన్నారు. పరిమితిని మించి తీసుకు వెళ్లవద్దని సూచించారు. విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా కాకీడ్రెస్ ధరించాలన్నారు. ప్రతి ఆటోలోను రికార్డులు ఉంచాలని సూచించారు. ఇన్సూరెన్స్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మోటారు సైకిళ్లపై ట్రిపుల్‌డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

# వందనమా.. వెన్నుపోటా..!?

- ఎంతమంది పిల్లలున్నా చదివిస్తానని నాడు హామీ
- 'అబ్బే.. ఒక్క విద్యార్థికే' అంటూ నేడు ఉత్తర్వులు
- గద్దెనెక్కాక ఫ్లేటు ఫిరాయింపు
- కూటమి ప్రభుత్వం తీరుపై తల్లుల వేదన



**బాలాజీచెరువు:** ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద చదువుకునేందుకు డబ్బులు వేస్తామని గొప్పగా హామీ ఇచ్చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీ నీరుగార్చేవిధంగా చర్యలు తీసుకుంటోందని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ప్రస్తుతం చదువుకుంటున్న పిల్లల తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తమ పిల్లలు పెద్ద చదువుల వరకు నిరాటంకంగా చదువుకునేందుకు ఎంతో దూరం ఆలోచించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అందజేసిన లబ్ధిని ఆ తల్లులు గుర్తు చేసుకుంటున్నారు. అర్హులైన విద్యార్థులందరికీ లబ్ధి అందించేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి పేర్లతో కూడిన జాబితాలను సచివాలయాల వద్ద జూన్, లేదా జూలై నెలల్లో నోటీస్ బోర్డులో ప్రదర్శించేవారు.

**ప్రతి విద్యార్థీ చదువుకోవాలనే**

ఏ ఒక్క పేద విద్యార్థి ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది అప్పటి సీఎం తరచుగా చెప్పిన మాట. గతంలో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ చిన్నారులను బడికి పంపేవారు కాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్సులు, స్కూల్ బ్యాగ్ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తూ పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేసేవారు. ప్రజా సంకల్ప యాత్రలో నిరుపేదల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి పేదరికంతో చదువుకు దూరం కాకూడదన్న సత్సంకల్పంతో అమ్మఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారు.

**అర్హులందరికీ అందించేందుకు**

అమ్మఒడి పథకం కింద వచ్చే లబ్ధిని ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన బ్యాంకు అకౌంటులో గత ప్రభుత్వం జమచేసేది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆధార్ లింక్ కాబడిన అకౌంట్లకు మాత్రమే లబ్ధిని జమ చేసేవారు. అర్హులైన అందరికీ ఈ పథకం అందించేలా సచివాలయ స్థాయిలో పనిచేస్తున్న విద్యా వెల్ఫేర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.

**పాఠశాల స్థాయిలో సమావేశాలు..**

అమ్మ ఒడి పథకంపై పేరెంట్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి సమావేశంలో అమ్మ ఒడిలో భాగస్వాములైన తల్లులందరినీ పిలిచి వివరించి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించేవారు.

### జాప్యంపై సందేహాలు

**కాకినాడ రూరల్:** అధికారం కోసం సూపర్ సిక్స్ హామీలు గుప్పించిన కూటమి పార్టీలు ఇప్పుడు మేనిఫెస్టో అమలులో కొత్త రాగాలు అందుకుంటున్నాయి. ఎలా ఎగవేయాలా అనే యోచనలో సాగుతున్న పథకం అమలులో జాప్యంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో కాకినాడ రూరల్ మండలం, కరప మండలంలో మొత్తం 72 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ అనే వ్యత్యాసం లేకుండా చదువుకుంటున్న పిల్లల తల్లుల ఖాతాల్లో గత ప్రభుత్వంలో అమ్మఒడి సొమ్ములు జమ చేశారు.

కాకినాడ రూరల్ మండలంలో మొత్తం 77 పాఠశాలల్లో 58 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 14 ఉన్నత పాఠశాలలతో పాటు బాలిక గురుకుల పాఠశాల ఉంది. మొత్తం 8,424 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారితో కలిపి ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న సుమారు 10,600 మంది విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి సొమ్ములను ఏటా అందించారు. కరప మండలంలో మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 51 ప్రాథమిక, 5 యూపీ, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 6288 మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం 5170 మంది విద్యార్థులకే పరిమితమయ్యారు. వారితో కలిపి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న సుమారు 6970 మంది విద్యార్థులకు అమ్మఒడి జమ చేశారు.

### సొమ్ములు సకాలంలో ఇవ్వాలి



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద సొమ్ములను సకాలంలో ఇవ్వాలి. నాకున్న ముగ్గురు పిల్లల్లో ఇద్దరు చదువుతున్నారు. వారిలో ఒకరు పదో తరగతి, మరొకరు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం. గత ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా ఒకరికి సొమ్ములు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం ఇస్తామంది. హామీని నెరవేర్చాలి.

– కొల్లుబోయిన భవాని, విద్యార్థుల తల్లి, వాకలపూడి, కాకినాడ రూరల్

### కూటమిని నమ్మి మోసపోయాం



ఎన్నికల ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేశారు. అందులో తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ 15 వేలు చొప్పున ఇస్తామంటే నిజమని నమ్మాం. మాకు ఇద్దరు పిల్లలు. జోసెఫ్ విక్టర్ నాలుగో తరగతి, కృపాకీర్తిని వేళంగిలోని ప్రైవేటు కాన్వెంట్‌లో ఆరో తరగతిలో చదివిస్తున్నాం. ఇద్దరికి రూ.30 వేలు వస్తుందన్న ధీమాతో ఉన్నాం. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట రూ 15 వేలే ఇస్తాననడం దారుణం. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయాం. ఇప్పుడు పిల్లల ఫీజులు ఎలా చెల్లించాలో తెలియడం లేదు.

– గట్టి కళ్యాణి, గృహిణి, వేములవాడ, కరప మండలం

### పిల్లలందరికీ పథకం వర్తింపజేయాలి



తల్లికి వందనం ఇద్దరు పిల్లలకు వర్తింపజేయాలి. మాది పేద కుటుంబం. ఇద్దరు అమ్మాయిలు, కాకినాడ గైగోలుపాడులో ఒక ప్రైవేట్ స్కూల్‌లో 6, 7 తరగతులు చదువుతున్నారు. పిల్లల చదువులకు ఆసరాగా ఉంటాయని తల్లికి వందనం సొమ్ముల కోసం ఎదురు చూస్తున్నాం. ఒకరికే ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం ఇద్దరికి సొమ్ములు వేయాలి.

– నాయుడు సుశీల, విద్యార్థినుల తల్లి, సర్పవరం, కాకినాడ రూరల్

### మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో శశాంక్ ప్రతిభ



శశాంక్‌కు ల్యాప్‌ట్యాప్‌ను అందిస్తున్న రాఘవేంద్రరావు తదితరులు

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** ఇంటర్నేషనల్ స్టాండర్డ్ మ్యాథ్‌మెటిక్స్ ఒలింపియాడ్ పరీక్షలో కాకినాడకు చెందిన శషాంక్ సాయి యశ్వంత్ రెడ్డి ప్రతిభను కనబరచి శాంసంగ్ ట్యాబ్‌ను గెలుచుకున్నాడు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో లెవిల్–2లో అతడు ఈ బహుమతిని సాధించాడు. శషాంక్ తల్లి దండ్రులు వై.సుగుణ, వై.శ్రీనివాస్ అతడిని అభినందించారు. ట్యాబ్‌ను గురువారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో నారాయణ స్కూల్ ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కో–ఆర్డినేటర్ మూర్తి, స్టేట్ హెడ్ పి.రవి, ప్రిన్సిపాల్ షర్మిల చేతులు మీదులగా శషాంక్ అందుకున్నాడు.

### పల్లెవెలుగు టిక్కెట్ రేట్ల పెంపు తగదు

**బోట్‌క్లబ్:** పల్లె వెలుగు బస్సుల్లో అల్ట్రా బస్ వేరయా అన్నట్టుగా రూ.10 అదనపు ధర వసూలు చేయడం దోపిడీ చందంగా ఉందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం అన్నారు. కాకినాడ జగన్నాథపురం నుంచి ద్రాక్షారామకు వెళ్లే పల్లె వెలుగు బస్ రూ.30 టికెట్ ధర వసూలు చేస్తుండగా అల్ట్రా పల్లె వెలుగు బస్‌లో రూ.40 వసూలు చేయడం తగదన్నారు. సామాన్యుల కోసం ప్రవేశపెట్టిన పల్లెవెలుగులో జరుగుతున్న అడ్డగోలు దోపిడీ సరికాదన్నారు.

### 14న మహా పూర్ణాహుతి

**బోట్‌క్లబ్:** వేద విజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు సందర్భంగా ఈ నెల 14న ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని పుసులూరి ఫణిశర్మ గురువారం తెలిపారు. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన వారాహి నవరాత్రి పూజలు హోమంతో పూర్తవుతుందన్నారు. నగర ప్రజలు అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు, ప్రసాదం స్వీకరించాల్సిందిగా కోరారు.

## ట్రిపుల్ ఐటీకి పెద్దాపురప్పాడు విద్యార్థినులు



కళాతేజస్విని



షారూన్



అఖిలాదేవి



భార్గవిసాయికుమారి



జయశ్రీలక్ష్మి



ఉమావెంకటశ్రీ

**కరప:** రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయుకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశానికి కరప మండలం బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ఏ స్ఎం శ్రీనివాస్ గురువారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థినుల్లో టి.కళాతేజస్విని, సీహెచ్ షారూన్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎం.అఖిలాదేవి, బి.జయశ్రీలక్ష్మి, ఎం.భార్గవి సాయికుమారి శ్రీకాకుళం క్యాంపస్‌కు, ఆర్.ఉమావెంకటశ్రీ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికై నట్టు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థినులను ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్, టి.వెంకట్రావు తదితర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### పేదలకు కళ్లజోళ్ల పంపిణీ

**బాలాజీచెరువు:** రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. లయన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి వి.రామ్‌చరణ్ హాజరై 60 మంది పేదలకు వాటిని పంపిణీ చేసి ఐదేళ్ల కాలంలో 3వేల మందికి ఉచితంగా పంపిణీ చేశామన్నారు. డాక్టర్ బాదం బాలకృష్ణ, సీమకుర్తి పాపారావు, కార్యదర్శి జగన్నాథరావు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదల ప్రగతికి ప్రతిబంధకం



వేళంగిలో నిర్వహిస్తున్న ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

**కరప:** పెరుగుతున్న జనాభా ప్రగతికి ప్రతిబంధకమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలు, పరిమిత కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేలా చైతన్య పరచాలని ఆయన కోరారు. వేళంగి పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర, సీడీపీఓ వై.లక్ష్మి మాట్లాడారు. వన్ స్టాప్ సెంటర్, మహిళలు, బాలల హక్కుల చట్టం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అతిసార నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించి, అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి నాటకాలు అవసరం



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ సభ్యులు

**బోట్‌క్లబ్ (కాకినాడసిటీ):** నేటి సమాజానికి నాటకాల అవసరం ఎంతో ఉందని తెలుగు నాటరంగ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళామందిరంలో గురువారం రాత్రి 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా వంటి రాష్ట్రాల్లో చిన్నారులకు విద్యతోపాటు ఒక రంగంలో శిక్షణ ఇస్తారన్నారు. నాటిక రంగంలో చిన్నారులు కరువైపోయారన్నారు. ఒకప్పుడు చిన్నారులు లేకుండా నాటికలు ఉండేవి కాదన్నారు. రచయితలు కూడా చిన్నారులకు పాత్రలు కల్పించి రాసేవారన్నారు. నేడు తమ పిల్లలను నాటక రంగానికి పంపేందుకు తల్లితండ్రులు ముందుకు రావడం లేదన్నారు. కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు మాట్లాడుతూ తమ పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతం పరిషత్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షులు కర్రి అచ్చుతరామారెడ్డి, వెంకటరామారావు, సుందర ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి షిరిడి సాయి కల్చరల్ వేల్ఫేర్ అసోసియేషన్ వారి మలిసంధ్య నాటిక ఆద్యంతం ప్రేక్షకులను మైమరపించింది. రెండో ప్రదర్శనగా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆ సరసాల నాటిక అలరించింది.

### ఇంటింటికీ తపాలా సేవలు

**పెద్దాపురం:** ఇంటింటికీ తంతి తపాలా శాఖ సేవలను మరింత విస్తృతం చేస్తామని పెద్దాపురం బ్రాంచి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నాయుడు అన్నారు. పట్టణంలో గురువారం తపాలా సేవలపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ తపాలా శాఖ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాక్సిడెంటల్ పాలసీ, ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి పథకాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాగర్, పోస్ట్ మాస్టర్ ప్రసాద్, వరహాలబాబు, బీపీఎంలు, ఏబీపీఎస్‌లు పాల్గొన్నారు.

## వలసపాకల విలీనం ఎప్పుడు?

- స్టే సత్వరం రద్దు చేయాలి
- పౌర సమావేశంలో తీర్మానం



వలసపాకల పంచాయతీ ఆవరణలో జరిగిన పౌర సమావేశం

**కాకినాడ రూరల్:** కాకినాడ అర్బన్ పరిధిలో ఉన్నప్పటికీ కార్పొరేషన్ పౌర సౌకర్యాలు అందక వలసపాకల ప్రగతి నిర్వీర్యమైందని స్థానిక పౌర సంఘం సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం పంచాయతీ ఆవరణలో జరిగిన పౌర సమావేశంలో కాకినాడ పరిసర 8 అర్బన్ గ్రామాల విలీన సాధనకు సమితిగా ఏర్పడి ప్రభుత్వం వద్దకు దశల వారీగా ప్రజల భాగస్వామ్య ప్రణాళిక తో ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళాలని నిర్ణయించాయి. స్టే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 13 ఏళ్లుగా వలసపాకల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తీరంలో భారీ పరిశ్రమల ద్వారా పుష్కలంగా ఆదాయం పొందుతున్న ప్రభుత్వం పౌర సౌకర్యాల పెంపుదలకు అవసరమైన విలీనం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా 8 అర్బన్ గ్రామాల విలీన సాధనకు కమిటీ ఏర్పాటు చేసి పోస్టుకార్డు ఉద్యమం, స్థానిక వెతల విజ్ఞాపనతో అమరావతికి సైకిల్ యాత్ర, ప్రభుత్వం, హైకోర్టు దృష్టికి పిటిషన్ తీసుకువెళ్లడం తదితర అంశాలపై చర్చించారు. గ్రామాల విలీనానికి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సార్వత్రిక ఎన్నికల ముందు చేపట్టిన గ్రామాల విలీన సాధనకు సంపూర్ణ మద్దతు పలికారని, ఈ మేరకు పంతం తోడ్పాటుతో ప్రభుత్వ నేతలను కలుస్తామని ముఖ్య అతిథిగా పాల్గొన్న పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. మేడిశెట్టి వేంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ గుబ్బల వేంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ సలాది శ్రీనివాసబాబు, మాజీ ఎంపీటీసీ సూరంపూడి వేంకట రమణ, డీసీసీ ప్రెసిడెంట్ గింజాల సూరిబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజయ్ కుమార్, జోగా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అలవాట్ల మార్పుతో క్యాన్సర్ నియంత్రణ




సెమినార్‌లో మాట్లాడుతున్న ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా

**కాకినాడ రూరల్:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరోగ్యవంతమైన జనాభా కోసం, శ్రేయోదాయకమైన రేపటి కోసం, క్యాన్సర్ కారక అలవాట్లను నిరోధించే లక్ష్యంగా స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో సెమినార్‌ను నిర్వహించారు. అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన 'ఎంపవరింగ్ కమ్యూనిటీస్, ఎరైజింగ్ క్యాన్సర్ అవేర్నెస్ ఫర్ హెల్తీయర్ పాపులేషన్' అనే అంశంపై, బ్రేక్ ద హ్యాబిట్ ఫర్ ఏ సేఫర్ టుమారో అనే నినాదంతో సెమినార్ సాగింది. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ ముఖ్య అతిథిగా క్యాన్సర్ నిపుణులు, ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగాతో విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన మాట్లాడుతూ మన జీవితంలో అత్యధికంగా ఉపయోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆహారపు అలవాట్లు, మాదకద్రవ్యాలు, పొగ తాగడం, వాయు, జల కాలుష్యాలు ప్రస్తుత ఈ సమాజంలో ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తాయన్నారు. అత్యధిక కలుషిత వాతావరణంలో ఇవి మన శరీర భాగాలను ప్రభావితం చేసి ఏ విధంగా క్యాన్సర్ కారకాలు అవుతాయి, ఎలాంటి జాగ్రత్తల ద్వారా క్యాన్సర్ కారకాలను నివారించవచ్చు అనే వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హరిబాబు అధ్యాపకులు డాక్టర్ స్టీఫెన్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ నాని బాబు, శ్రీనివాసరావు, డాక్టర్ ఉమారజిత అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### వాతావరణ ఆధారిత పంటల సాగు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న భ్రమరాంబ

**పిఠాపురం:** రైతులు వాతావరణ ఆధారిత పంటల సాగు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు భ్రమరాంబ సూచించారు. పిఠాపురం మండలం విరవలో గురువారం సర్పంచ్ నడిగట్ల చింతలరావు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భ్రమరాంబ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, వాతావరణ ఆధారిత పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగుపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు, వీఏఏ రమ్యశైలి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం




మెయిన్‌రోడ్డులో సాగుతున్న ర్యాలీలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

**కాకినాడ:** సీజనల్ వ్యాధులైన అతిసారం, డెంగీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక మెయిన్ రోడ్ లోని సూపర్ బజార్ నుంచి జగన్నాథపురం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. సూపర్ బజార్, మసీద్ సెంటర్, గ్లాస్ హౌస్, గోల్డ్ మార్కెట్ సెంటర్ మీదుగా జరిగిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించవచ్చునని ఎమ్మెల్యే, కమిషనర్ వెంకట్రావు సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం కనిపిస్తే నగరపాలక సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990ను సంప్రదించవచ్చునన్నారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగేశ్వరనాయక్, కార్పొరేషన్ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, సీఓలు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.